# హన్నా

# మాతృత్వానికి స్మారక చిహ్నం

## (1:1-2:21)

స్పార్టా దేశపు సముద్రపు రాజగు అగసిలస్ II (c. 444–360 క్రీ.పూ.) మరణ సమయంలో, తన విగ్రహాన్నెక్కడా నెలకొల్పకూడదని ఆదేశం జారీ చేశాడు. ఇంకా ఇలా అన్నాడు: “గౌరవపదమైన ఘనకార్యం నేనేదైనా చేసియుంటే, అదే నా జ్ఞాపక చిహ్నం; కాని నేను అలాటిది ఏదీ చేయకుంటే, మీ పోత విగ్రహాలు దేనినీ సూచింపవు.” స్మారక చిహ్నం అనేదానికి అది తగిన భావనయై ఉంది – చలువరాతితో చేయబడనివే శ్రేష్ఠమైనవి! ఒకడు తన జీవితం ద్వారా నిలిపిన మంచి మాటలు, క్రియలు స్మారక చిహ్నాలకు సుప్రతిష్ఠగలవిగా ఉంటాయి.

అందమైన స్త్రీ హన్నాలో “మాతృత్వానికి జ్ఞాపక చిహ్నంగా” నిలిచియుండే జీవిత విధానాన్ని మనం కనుగొంటాం. శతాబ్దాల తరబడి బైబిలు విద్యార్థులు ఆమెను అభినందించుతునే ఉన్నారు. మరియు “ప్రార్థనాపరురాలైన తల్లి” లేదా “దేవునియెదుట ఆదర్శ మూర్తియగు తల్లి” అనే గొప్ప పొగడ్తలను ఆమె పొందింది. ఏదియెలాగున్నా, నీవు ఆమెను తిలకించునప్పుడు, పరిశుద్ధ లేఖనాల్లోని మిక్కిలి దైవభక్తిగల స్త్రీల ప్రక్కన ఆమెను నిలుపవలసియుంటుంది.

హన్నాను గూర్చి బైబిలులో ఈ చారిత్రక వాస్తవాలను కనుగొంటాం. ఈమె గర్భవతికాని గొప్ప స్త్రీలలో నాల్గవది. ఏర్పరచబడిన సంఖ్యలోను ఈమె చాలా ఆత్మ సంబంధి. శారా నవ్వింది, రిబ్కా అలక్ష్యంగా ఉంది; రాహేలు విసుగుచెంది కోపగించు కొంది. మనకు తెలిసినంతమట్టుకు హన్నా మాత్రమే ప్రార్థన ద్వార దైవికమైన సహాయం పొందింది. ఆమె జీవిత చరిత్రను గూర్చిన వివరాలు మనకు యివ్వబడలేదు. హన్నా జీవించిన కాలంలో పురుషుల యొక్క పితరులను గూర్చి తెలియజేయడమే ఆచారంగా ఉండేది. 1 సమూయేలు ఆరంభ పేజీల్లో లభించే సందేశంనుండి మాత్రమే మనకు సంగతులు తెలిసికొనే వీలు కలిగింది.

హన్నా ఎల్కానాకు మొదటి భార్య. ఆమె గొడ్రాలయిన కారణాన రెండవ భార్య వచ్చింది. దేవుని ఆది సంకల్పంతో ఈ ఏర్పాటు సుసంయోజితమైనది కాదు (ఆది. 2:24; మలాకీ 2:15; మత్తయి 19:4). ఎల్కానా యొక్క బహు భార్యత్వం సహజంగా దుఃఖవంతమైన పరిణామాలకు దారితీసింది. హన్నాకు ఎల్కానా చూపించే ప్రత్యేకమైన ప్రేమ విషయంలో పెనిన్నా అసూయపడింది. ఆమె గర్వాన్ని, అతిశయాన్ని చూపించ సాగింది. హన్నా లోపాన్ని ఆధారం చేసుకుని నిరంతరం అవమానించేది. హన్నా ఎదురు తిరగకుండా ఆ క్రూరత్వాన్ని ఓపికతో భరించుతూ ఉండేది. షిలోహులో సంవత్సరపు ఉత్సవాలు జరుగుతుండే సమయంలో హన్నా యొక్క దుఃఖం అధికమవుతూ ఉండేది.

కడకు ఆమెకాభారం మోయలేనంతగా మారిపోయింది. ఒత్తిడి, అవమానం, స్వయం నిందారోపణ అంతా ఆమె తలకు ఎక్కింది. వేదనతో కొట్టుమిట్టాడి, బలి సంబంధమైన విందును విడిచి, గుడారం వద్ద ఆశ్రయం కోరింది.

యూదుల ఆచారం ప్రకారం, ఆ సమాయనికి ప్రత్యక్షగుడారం తన మహిమను చాలావరకు పోగొట్టుకుంది. కొన్ని తెరలు మందసానికి చుట్టు దింపబడ్డాయి, మరియు గుడారము చుట్టూ మరమత్తులేని, ఎత్తులేని గోడ ఉంది. దాని గుమ్మము వద్ద ప్రధాన యాజకుడైన ఏలీ కూర్చున్నాడు. హన్నా ఆవరణంలో ప్రవేశించి మౌన ప్రార్థనలో తన హృదయాన్ని దేవుని సముఖంలో కుమ్మరించనారంభించింది. తాను త్రాగి మత్తురాలై యున్నట్టు తలంచిన ఏలీచే ఆమె గుర్తించబడింది. కఠినమైన మాటలతో ఏలీ హన్నాను గద్దించాడు. అందుకు దయను పుట్టించే మాటలతో హన్నా తన జవాబునిచ్చింది. హన్నా యొక్క భారాన్ని గ్రహించిన ఏలీ, ఆమె ప్రార్థన సిద్ధించునుగాకనియు, ఆమెకు గర్భఫలం అనుగ్రహింపబడుతుందనియు తెలిపాడు. హన్నా ప్రత్యక్షగుడారాన్ని విడిచిపోయినప్పుడు, ఆమె భారం సంపూర్ణంగా తొలగింపబడింది. తన దుఃఖ భారాన్ని ఆమె దేవుని చేతిలో ఉంచింది. తనకు కుమారుడు కలుగుతాడనియు, దేవుని పరిచర్య కొరకు ఆమె వానిని సమర్పించనున్నదనియు అభయం కలిగి ఉంది.

హన్నా ఎల్కానా వద్దకు వచ్చి తత్‌క్షణమే ఆ సమాచారాన్ని అతనికి అందించింది. ప్రతిఫలం పొందిన ప్రార్థనను వారిరువురు కలసి ఆనందించారు. ఆమెకు పుట్టిన బిడ్డ దేవుని కడపటి న్యాయాధిపతిగాను, తొలి ప్రవక్తగాను ఉండేందుకు సమర్థవంతంగా మూడు సంవత్సరాలు ప్రేమతో పెరిగాడు.

మూడు సంవత్సరముల తరువాత హన్నా సంవత్సరపు పండుగకు తిరిగి వచ్చింది. తన తొలిచూలు బిడ్డను అక్కడే విడిచి వెళ్లడానికి సిద్ధపడే వచ్చింది. ఆమె ప్రత్యక్ష గుడారము వద్దకు చేరుకున్నప్పుడు, మూడు సంవత్సరాలకు ముందు తాను ఎక్కడ నిలబడిందో అక్కడికే వచ్చి నిలిచింది. ఆనాటి జ్ఞాపకాలు ఆమె మనస్సు నిండిపోయా యనడానికి సందేహం లేదు (1:26, 27).

ఆమె సమూయేలును సమర్పించునప్పుడు, ఆమె దేవుడైన యెహోవాకు పూజకు సంబంధించిన ఒక కీర్తనను మరియు స్తుతిని అర్పించింది. కనికరంగల ఆయన కాపుదలకు అప్పగించుతూ ఆమె తన లేతప్రాయంగల కుమారుని సమర్పించింది. సంవత్సరపు బలి జరిగే ప్రతిసారి, హన్నా సమూయేలుకు ఒక అంగీని తెస్తూ ఉండేది. ఆ అంగీలోని ప్రతి కుట్టు ప్రేమతో వేయబడుతూ ఉండేది. మాతృత్వానికి ఆశ్చర్యకరమగు జ్ఞాపక చిహ్నంగా నిలిచిన ఈమె సంక్షిప్త చరిత్ర యిది!

## హన్నా యొక్క జ్ఞాపక చిహ్నం

స్వభావంలోగల ఆమె ప్రత్యేక గుణలక్షణాలు మాతృత్వానికి శాశ్వతంగా నిలిచే స్మారక చిహ్నాన్ని నెలకొల్పాయి.

## దేవునియందలి విశ్వాస చిహ్నం

సందేహంతో, నిరాశలో ఉన్నప్పుడు హన్నా దేవునివైపు తిరిగింది (1:9–18; 2:1–10). ఆమె విశ్వాసం విస్మరించ లేనంతగా గుర్తింపబడింది!

మొదటిగా, దేవుడు తనకు బిడ్డను ప్రసాదించునని నమ్మి, ఆమె తన విశ్వాసాన్ని ప్రదర్శించింది. సమయం గడిచేకొలది ఆమె దుఃఖం ఆమె ఆత్మ బలాన్ని కరిగిపోయేలా చేసింది. సంవత్సరాలకొద్దీ ఆమె ఆశ్చర్యం, సందేహం, అప్పుడప్పుడు జనించే నిరీక్షణ ఆమెకు కలత కలిగించే కలలుగా ఆమె చుట్టు తిరుగుతూ ఉన్నాయి. అయినా ఆమె దేవుని మీద ఎక్కువగా ఆధారపడుతూ ఉండేది. చివరిగా, భారాన్ని భరించలేక, ఆమె దేవుని వద్దకు వెళ్లింది. ఏలీ వద్దనుండి ఆమె బయలుదేరినప్పుడు, దేవుని జవాబు గురించి ఆమె నమ్మిక కలిగియుంది (1:17). హన్నా తన భారాన్ని యెహోవామీద మోపింది. తాను ఎంతవరకు చేయగలదో అంతవరకు చేసి తక్కిన దానిని దేవుని మీద భారం మోపింది.

రెండవదిగా, సమూయేలును ఏలీ చేతికి అప్పగిస్తూ, అతనిని (ఆ శిశువును) దేవునికి సమర్పిస్తూ ఆమె తన విశ్వాసాన్ని ప్రదర్శించింది (2:1–10). 1 సమూ. 1:27లో అత్యుత్తమమైన విశ్వాసపు మాటలను పలికింది: “ఈ బిడ్డను దయచేయుమని యెహోవాతో నేను చేసిన మనవిని ఆయన నాకనుగ్రహించెను.” హన్నా యొక్క కీర్తన (2:1నుండి) గాఢమైన విశ్వాసంతో చేసిన గంభీరమైన ప్రతిపాదన ఆత్మ యొక్క సున్నితత్వము, పాత నిబంధనలో మరి ఎక్కడ కన్పించని, క్రొత్త నిబంధనలోని మరియ గీతంతో సమానమైన భక్తి యొక్క ఆనందాన్ని అది బయలుపరచుతోంది (లూకా 1:46నుండి). దేవుడు పరిశుద్ధుడు, బలవంతుడు, జ్ఞాన సంపన్నుడు మరియు అందరిపైనున్న న్యాయాధిపతి అనే తలంపులను హన్నా కీర్తన వర్ణిస్తుంది.

మూడవదిగా, ప్రత్యక్షగుడారము వద్ద సమూయేలును విడిచి వెళ్లడంలో ఆమె తన విశ్వాసాన్ని ప్రదర్శించింది (1:28; 2:11). అతడు మూడేండ్ల బాలుడు మాత్రమే! అలా చేయడంలో ఆమె ఎట్టి భయమును చెందలేదు. ఆమె వానిని దేవుని రక్షణలో ఉంచింది.

హన్నా విశ్వాసం వంటి విశ్వాసం హెబ్రీ. 4:16; 1 పేతురు 5:7వంటి లేఖనాల్లో మనకు గోచరిస్తూ ఉంటుంది.

## శోధనలలో ఓర్చుకొను చిహ్నం (1:7)

ఆమె ఎంతకాలం గొడ్రాలైయుందో మనమెరుగం. కీర్తన. 142:4బి లోని మాటలను గురించి ఆమె ఆలోచించిదంటే సందేహపడనవసరంలేదు. “ఆశ్రయమేదియు నాకు దొరుకలేదు.” అనుగ్రహం తనను తప్ప అందరిని వరించినట్టుగా గోచరించింది. దేవుడు పెద్ద తప్పు చేసాడని ఆమె గట్టిగా నమ్మింది. క్రూరమైన పెనిన్నా యొక్క మాటలు అనుభవించగల దానికంటెను ఎక్కువగా హన్నాను బాధించాయి. అయినా ఆమె చేయగలిగింది ఏముంది? ఆమె ఓర్పుతో ఉండి శోధనను సహించుతూ ఉండేది. ఈ ఓర్పే ఆమె విశ్వాసాన్ని గాఢమైనదిగా చేసి, ఆశను రేకెత్తించింది.

### ఆమె పిల్లలపట్ల విశ్వాసనీయంగా ఉండు చిహ్నం (1:22; 2:19)

సమూయేలుకు ఆమె ఎంతోచేసింది. ఆలోచనతోను, మారని మమతతోను ఆమె అతని పెంచింది. ఆమె వానిని గూర్చి ప్రార్థించి, అతని మనోభావాలను ఆమె దేవునివైపు మరల్చింది. హన్నా తన కుమారుని పెంచడంలోనూ, దేవునికి సమర్పించడంలోనూ సంపూర్ణ సమర్పణ కలిగియుంది. టాల్మడ్‌లో "ఎవరు శ్రేష్ఠంగా బోధించబడినవారు? తన తల్లిచేత నేర్పించబడినవాడే!" ఆధునిక కాలంలో ఈ విషయం జ్ఞాపకం చేసికొనడం ఉత్తమం అనిపిస్తుంది. ప్రతి సంవత్సరం ఆమె తెచ్చే అంగీవలన హన్నా యొక్క భక్తి విశ్వాసము తెలియవస్తుంది. అది ఉన్నితో కుట్టులేకుండ నేయబడిన దిగువ వస్త్రమైయుంది. దీనిపైన యాజకుడు ఏఫోదును ధరించుతాడు. ప్రతి ఏట ఆమె భక్తి విశ్వాసానికి గుర్తుగానున్న ఆ అంగీని తన తల్లి తెస్తుందని సమూయేలు ఎదురు చూసేవాడు.

### త్యాగమునకు చిహ్నం (1:28)

తన అతి ప్రశస్తమైన బహుమానాన్ని ఆమె దేవునికి సమర్పించాలని అనుకుంది. స్వేచ్ఛగా ఆమె తన చిత్తాన్ని దేవునికి అప్పగించుకొంది. సరిక్రొత్తగా ఆమె తన్ను తాను దేవునికి సమర్పించుకొనడంలో ఆయన మహిమనే ఆశ్రయించింది. సమూయేలుకు అతి శ్రేష్ఠమైనదేదో దానికొరకు తన సొంత అవసరాలను యిష్ట పూర్వకంగాను, ప్రేమ పూర్వకంగాను త్యాగం చేసింది.

### తల్లిగా పెంచే చిహ్నం (1:28)

తన కుమారుని కోసం ఆమె ఒకే ఒక గురిని కలిగి ఉండేది – నిరంతరం అతడు దేవుని యింట నివసించడం అనేదే ఆమె గురి (1:22). తన బిడ్డను అప్పగింత (నమ్మిక)గా చూచిందేగాని పరిపూర్ణమైన ఈవిగా కాదు. ఆమె అనుకున్న దానికి కొన్ని కఠినమైన బాధ్యతలున్నాయి. తనకు అప్పగింపబడ్డ వాటి విషయంలో నమ్మకంగా ఉండాలని నిశ్చయించింది. తన కుమారుని పెంచే బాధ్యత మాత్రమే గాక దేవునికి ఒక సేవకుని (జనులకు) ఒక నాయకుని యిచ్చే బాధ్యతను కూడా చేపట్టింది! ఈలాటి గుర్తింపు నేడు ప్రతి తల్లియందును ఉండవలసియుంది. తల్లిగా హన్నా దీన్ని సాధించింది. ఆమె కుమారుడు దేవునియెదుట ఎదిగినట్టు హన్నా జీవిత చరిత్ర ఉద్ఘాటిస్తుంది (2:21).

## జ్ఞాపక చిహ్నాలుగా నిలిచిన పాఠాలు

తల్లిగా హన్నా చేసిన దానినుండి విలువైన శాశ్వత పాఠాలు బోధించబడ్డాయి.

**జ్ఞాపకం ఉంచుకో:** తల్లి యొక్క పాత్ర ముఖ్యమైనది! తల్లి యొక్క విశ్వాసం ఆమె పిల్లలలో నాటుకుంటుంది. ఆమె విశ్వాసము బలమైనదైతే, అది అంకురించి ఎదుగుతుంది. తల్లి యొక్క తత్వం తన పిల్లలలో కన్పిస్తుంది. తల్లులారా, మీరు మీ పిల్లలకు దేవుని గూర్చి స్పర్శ, భక్తి పూర్వకమైన విశ్వాసం, స్వార్థ రహితమైన సేవను నేర్పిస్తున్నారా? తల్లులారా, శోధన కాలములలో "తల్లి" యొక్క ఆలోచనలలో మీ బిడ్డ భద్రతను

కనుగొంటున్నాడా? పిల్లలు చూచేది ఏదో దానిని వారు అనుకరిస్తారు. సాధుత్వం, భయభక్తి, అనేవాటిని తల్లులు ప్రదర్శించడం ముఖ్యం. అలాటి గుణగణాలను పిల్లలు అనుకరిస్తారు!

**జ్ఞాపకముంచుకో: ఒక తల్లి పాత్ర చాలా ముఖ్యమైనది.** దేవునియందు ఒక స్త్రీకున్న నిర్మలమైన విశ్వాసం, ఎల్లప్పుడు కనుపరచే సాధుత్వం ఆమె భర్త యొక్కయు పిల్లల యొక్కయు జీవితాలకు మాధుర్యాన్నిస్తాయి. దేవుడు తమకు ప్రసాదించిన పాత్రలలో నిలిచి సాధువైన మృధువైన మాటలతోను, ఓర్పుతో కూడిన దయతోను నిర్వహించే తల్లులు తమ "గృహాలను, మధురమైన గృహాలుగా" తీర్చి దిద్దుకుంటారు!

**జ్ఞాపకముంచుకో: తల్లులు తమ పిల్లలను దేవుని కొరకు పెంచాలి!** దేవునియెడల ఎడతెగని భక్తిని తల్లులు తమ పిల్లలయందు కలిగించాలి. దేవుని గూర్చియు, ఆయన అధికారాన్ని గూర్చియు నమ్మకాన్ని వారు తమ పిల్లలకు నేర్పించాలి. దేవుని చిత్తానికి దైనిక విధేయతను కనుపరచేలా తన పిల్లలకు నేర్పించి, వారి శీలంలోను ప్రవర్తనలోను పరిశుద్ధతను అనుకరించేలా చేసే తల్లి ధన్యురాలు.

## ముగింపు

జలములో దాగిఉన్న పగడములు ప్రకృతి యొక్క మహా గొప్ప జ్ఞాపక చిహ్నాలుగా ఉంటాయి. సముద్రపు చిప్పలు బతికి ఉన్నప్పుడు చేసే రసోత్రాదన వల్ల పగడాలు రూపొందుతాయి. వాస్తవానికి, ఈ గొప్ప పగడాలు జీవించినప్పటి జ్ఞాపక చిహ్నాలే. వాటి ఉనికి శాశ్వతమైన రికార్డుగా సర్వ కాలాలకు చాటబడుతుంది. హన్నావంటి దైవభక్తిగల తల్లులు ఆలాటి జ్ఞాపక చిహ్నాలైయున్నారు.

తల్లులారా, మీ జీవితాలు సంతోషానికిని, ఆనందానికిని జ్ఞాపక చిహ్నాలుగా ఉండాలని నిర్ణయం తీసుకోండి. దేవునియందు నిశ్చలమైన విశ్వాసాన్ని, శోధనలలో ఓర్పును, యితరులపట్ల త్యాగమును, విశ్వాసాన్ని కనుపరచుతూ – సర్వశక్తుడగు దేవునిపట్ల ఎన్నటికి తప్పిపోని సమర్పణను నిలుపుకొనేలా మీ శక్తులను వినియోగించండి. తల్లులారా, మీ బిడ్డల పెంపకం హన్నా వంటిదిగా ఉండేలా గురి కలిగియుండండి: "కాబట్టి నేను ఆ బిడ్డను యెహోవాకు ప్రతిష్ఠించుచున్నాను; తాను బ్రదుకు దినములన్నిటను వాడు యెహోవాకు ప్రతిష్ఠుడని చెప్పెను" (1:28).